ఇన్‌స్టా ముసుగులో వలపువల

- ఎన్నారైని బ్లాక్‌మెయిల్ చేసి నిశ్చితార్థం
- భారీగా డబ్బు వసూలుకు ప్లాన్
- బాధితుడి ఫిర్యాదుతో యువతి అరెస్టు
- విశాఖపట్నంలో వెలుగుచూసిన ఘటన

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయాలతో యువకులను ముగ్గులోకి దింపి వారి నుంచి డబ్బులు గుంజుతూ మోసాలకు పాల్పడుతున్న యువతిని ఏపీ పోలీసులు అరెస్టుచేశారు. భీమిలి సీఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని మురళీనగర్‌కు చెందిన కొరుప్రోలు జోయ్ జమీనా అమెరికాలో ఉంటున్న ఎన్ఆర్ఐ మనోహర్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకున్నది. వైజాగ్‌లో నివాసముంటున్న ఆ యువకుడి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మనోహర్ స్నేహితురాలిని అంటూ పరిచయం చేసుకున్నది. కొన్ని రోజుల పాటు వారితో మంచిగా నటిస్తూ మీ అబ్బాయిని పెళ్లి చేసుకుంటానని చెప్పగా వారు నిరాకరించారు. దీంతో ఆమె అమెరికా నుంచి యువకుడిని రప్పించి ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా మురళీనగర్ ఎన్జీవో కాలనీలోని తన ఇంటికి తీసుకెళ్లింది. మత్తు పానీయం ఇచ్చి ఇరువురు సన్నిహితంగా ఉంటున్నట్టు ఫొటోలు తీసింది. వాటితో తనను పెళ్లి చేసుకోవాలని బ్లాక్‌మెయిల్ చేసింది. భీమిలిలోని ఓ రెస్టారెంట్‌లో రూ.5 లక్షలు ఖర్చు చేయించి తన స్నేహితుల సమక్షంలో బలవంతంగా నిశ్చితార్థం చేయించుకున్నది. అనంతరం పెళ్లి చేసుకోకపోతే అభ్యంతరకర ఫొటోలను బహిర్గతం చేస్తానని బెదిరిస్తూ వేధింపులకు గురిచేసింది. ఎన్నారై మనోహర్‌ను రోజుల తరబడి ఇంట్లో బంధించింది. ఎట్టకేలకు ఆమె నుంచి తప్పించుకున్న బాధితుడు.. ఈ నెల 4న భీమిలి పోలీస్‌స్టేషన్‌లో యువతిపై ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితురాలి నుంచి ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ ఇదే తరహాలో పలువురిని మోసగించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు నిర్ధారించి నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



నోటీసు చూపిస్తున్న చంద్రనాయక్



కోర్టు నుంచి వచ్చిన నోటీసు

తెలంగాణ ఉద్యమకారులకు కోర్టు నోటీసులు

- సకలజనుల సమ్మెలో ఆర్టీసీ బస్సు ఆపినందుకు..
- అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు
- నవంబర్ 19న హాజరుకావాలని 28 మందికి సమన్లు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 6: ప్రత్యేక రాష్ట్రం కోసం 2011లో సకల జనుల సమ్మె సమయంలో అప్పటి తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆర్టీసీ బస్సులను ఆపారు. అందుకుగానూ.. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబ్‌నగర్ ఉద్యోగ సంఘం నాయకులపై అక్రమ కేసులను బనాయించింది. తాజాగా మళ్లీ పాత కేసులను బయటకు తీసి వారికి నోటీసులు పంపడం బాధాకరం. 28 మంది తెలంగాణ ఉద్యమకారులకు నోటీసులు పంపి.. నవంబర్ 19న కోర్టుకు హాజరు కావాలని పేర్కొన్నది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఉద్యమాన్ని తమ భుజస్కంధాలపై మోస్తూ సబ్బండ వర్గాలను ఏకం చేసిన ఉద్యోగ సంఘం నాయకులకు తాజాగా నోటీసులు రావడంతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నోటీసులందుకున్న 28 మందిలో 15 మంది ఇప్పుడు ఉద్యోగ విరమణ పొందారు. వారి వయస్సు 70 ఏండ్ల పైబడింది. నలుగురు మహిళా ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటికైనా ఆ కేసును రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉద్యమ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కనుల పండువగా గంగానీళ్ల జాతర

సారంగాపూర్/దిలావర్‌పూర్, అక్టోబర్ 6 : నిర్మల్ జిల్లా సారంగాపూర్, దిలావర్‌పూర్ మండలాల్లో గంగానీళ్ల జాతర అంగరంగా వైభవంగా ముగిసింది. ఆదివారం భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకున్నారు. పవిత్ర కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలో నిలబడి మొక్కులు తీర్చుకున్నారు. గంగానీళ్ల జాతరను పురస్కరించుకొని నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్రలోని నాగపూర్, నాందేడ్, ఇస్లాపూర్, హిమాయత్‌నగర్ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పోచమ్మ తల్లికి మొక్కలు చెల్లించుకున్నారు.

- కూష్మాండ మాతగా ఏడుపాయల దుర్గమ్మ

మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం దుర్గమ్మ కూశ్మాండ మాత అలంకరణతో దర్శనమిచ్చారు. – పాపన్నపేట

- మహాలక్ష్మి అలంకరణలో..

మహబూబ్‌నగర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.6,66,66,666తో అలంకరించారు. – పాలమూరు

- లలితా త్రిపురసుందరీ దేవిగా కనకదుర్గమ్మ

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఇంద్రకీలాద్రి కిక్కిరిసిపోయింది. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

- ముత్యపు పందిరి వాహనంపై శ్రీవారు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మలయప్పస్వామి ముత్యపు పందిరి వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

డొక్కు బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీలో డొక్కు బస్సుల స్థానంలో కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులను తెచ్చేందుకు సంస్థ ప్లాన్ చేస్తున్నది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి గత పదేండ్లలో ఏకంగా 6,680 డొక్కు బస్సులను ఆర్టీసీ తుక్కు కింద వేలం వేసి అమ్మేయగా, వాటిస్థానంలో 4,226 బస్సులను కొనుగోలు చేసింది. ప్రస్తుతం వెంటనే తుక్కుగా మార్చాల్సిన 1,213 డొక్కు బస్సుల స్థానంలో కొత్తవాటిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి ఇటీవలే ఆర్టీసీ నివేదిక పంపింది. పీఎం ఈ డ్రైవ్ పథకంలో హైదరాబాద్ నగరానికి ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వాలని సంస్థ ఇప్పటికే దరఖాస్తు చేసుకొన్నది. నగరం అవసరాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం మరో 2,300 ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు తీసుకునే చాన్స్ ఉన్నట్టు తెలుస్తున్నది. ఒక్కో బస్సు ధర రూ.1.85 కోట్లు ఉండడంతో అద్దెకు తీసుకోవాలని యోచిస్తున్నది.

సింగూరు రెండు గేట్లు ఎత్తివేత

పుల్కల్, అక్టోబర్ 6: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఆదివారం 6, 11వ నంబర్ గేట్లు 1.50 మీటర్ల మేర ఎత్తి 11,026 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. విద్యుత్తు ఉత్పత్తి కోసం జెన్కోకు 2,796 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆదివారం 13,076 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో, 14,453 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగినట్టు ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, 29.708 టీఎంసీలు నీరు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

ఈబీసీలపై కాంగ్రెస్ వైఖరేంటి?: రవీందర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఈబీసీలపై కాంగ్రెస్ పార్టీ వైఖరేమిటో స్పష్టం చేయాలని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ఈబీసీల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వీ రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈబీసీల జోలికొస్తే దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు.

గోమాతకు పుట్టిన రోజు వేడుకలు

జగిత్యాలజిల్లా బీర్‌పూర్‌లో ఓ రైతు కుటుంబం లేగదూడకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించింది. బైరవేని సత్యనారాయణ- భాగ్యలక్ష్మి దంపతులు పెంచుకుంటున్న ఆవుకు పుట్టిన లేగదూడకు ఆదివారంతో సంవత్సరం నిండింది. ఈ క్రమంలో వేద పండితుడి ఆధ్వర్యంలో గోమాతకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేట్ కట్ చేసి.. స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. – సారంగాపూర్

దసరా వేడుకలపై ప్రతిష్టంభన..

- రామగుండం బల్దియాకు నిధుల కొరత
- ఇప్పటివరకూ ఉత్సవాల ఊసే లేదు

కోల్‌సిటీ, అక్టోబర్ 6: దసరా, సద్దుల బతుకమ్మ కోసం చేపట్టే ఏర్పాట్ల పనుల విషయంలో ఈ ఏడు సందిగ్ధత నెలకొంది. ఏటా రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను ప్రత్యేకంగా నిర్వహించడం ఏండ్ల తరబడి ఆనవాయితీగా వస్తున్న విషయం విధితమే. గోదావరిఖని జవహర్‌నగర్‌లోని సింగరేణి స్టేడియంలో ఏటా నిర్వహించే దసరా వేడుకలకు సంబంధించి ఇప్పటికీ ఏర్పాట్లు చేపట్టకపోవడంతో సందిగ్ధత నెలకొంది. నగరపాలక సంస్థలోని ఖజానాలో నిధుల కొరత సాకుతో ఈ ఏడు దసరా వేడుకల బాధ్యత తీసుకోవడం లేదని తెలుస్తోంది. ఐతే స్థానికంగా ఉన్న సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థల సహకారం తీసుకొని వేడుకలు జరపాలని స్థానికుల నుంచి డిమాండ్ వినిపిస్తోంది.

ఎన్నో ఏండ్లుగా జరుగుతున్న వేడుకలు..

స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో దసరా వేడుకలు ఎన్నో యేళ్లుగా జరుగుతున్నాయి. ఏటా దసరా వచ్చిందంటే చాలు పారిశ్రామిక ప్రాంత ప్రజలకు పెద్ద పండుగే. రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వారం రోజుల ముందే సమీక్షా సమావేశం నిర్వహించి, దసరా వేడుకలకు బడ్జెట్ నుంచి దాదాపు రూ. 5 లక్షల వరకు నిధులు కేటాయించేవారు. దసరా రోజున స్టేడియంలో అహ్లాదకర వాతావరణంలో రావణ వధ, క్రాకర్స్‌తో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు పెద్ద ఎత్తున జరిగేవి. అంతేగాక సినీ రంగ కళాకారులతో ప్రత్యేకించి సాంస్కృతిక ప్రదర్శనలు జరిగేవి. పారిశ్రామిక ప్రాంతం నుంచి దాదాపు 50 వేల మంది చిలుకు ప్రజలు ఈ వేడుకలకు హాజరయ్యేవారు. కానీ, ఈ ఏడాది అదేమిటంటే.. ఇప్పటివరకు దసరా వేడుకలపై నగర పాలక సంస్థ అధికారులు దృష్టి సారించడం లేదు. కానీ, దసరా వేడుకలు ఈఏడు కూడా ఎలాగోలా కొనసాగించేలా దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై కూడా చేతులెత్తేసిన బల్దియా యంత్రాంగం ఇటు దసరా వేడుకలు కూడా భారమయ్యాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి

ఓదెల, అక్టోబర్ 6: కనగర్తి గ్రామానికి చెందిన పెరిక మొండయ్య (60) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు పొత్కపల్లి హెడ్‌కానిస్టేబుల్ అనుమాండ్ల కిషన్ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మొండయ్య భార్య గతంలోనే మృతి చెందింది. కొడుకు జీవనోపాధి కోసం హైదారాబాద్‌లో ఉంటున్నాడు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న మొండయ్య శనివారం రాత్రి బహిర్భూమికి వెళ్లి కాలు జారీ ప్రమాదవశాత్తు చెరువులో పడినట్లు కూతురు రమ ఫిర్యాదు చేశారు. ఆదివారం చెరువులో శవమై కనిపించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గునుగుపూలకు వెళ్తూ ఒకరి..

వేముల లక్ష్మయ్య(ఫైల్)

పెద్దపల్లి రూరల్ : మరో ఐదురోజుల్లో ఉన్న సద్దుల బతుకమ్మ పండుగకు దేవునిపల్లి లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకొని టేకు, గునుగు పూలు తెప్పుకొద్దామని బయలు దేరిన భార్యాభర్తలకు రోడ్డుప్రమాదం ఆ కుటుంబంలో, గ్రామంలో పండుగముందు తీరని విషాదం నింపింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. బ్రాహ్మణపల్లికి చెందిన వేముల లక్ష్మయ్య దేవునిపల్లిలోని లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకొని అదే గుట్టకు టేకు పువ్వును బతుకమ్మ పండుగకు కోసుకొద్దామని భార్య మల్లేశ్వరితో కలిసి టీవీఎస్ వాహనంపై దేవునిపల్లికి బయలు దేరారు. ఈ క్రమంలో అందుగులపల్లి వద్దకు రాగానే గోదావరిఖని నుంచి పెద్దపల్లివైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో లక్ష్మయ్య (58) తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మల్లేశ్వరికి స్వల్ప గాయాలయ్యాయ. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

ములుగు వాటర్‌ఫాల్స్‌లో పడి..

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 6 : సరదాగా స్నేహితులతో కలిసి ములుగు వాటర్‌ఫాల్స్‌కు వెళ్లి ప్రమాదశాత్తు గోదావరిఖని శారదనగర్‌కు చెందిన బండారి నితిన్ (21) విద్యార్థి వాటర్‌ఫాల్స్‌లో గల్లంతై మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. సింగరేణి ఆర్జీ-1 వర్క్‌షాప్‌లో ఫోర్‌మెన్ బండారి శ్రీనివాస్ ఒక్కగానొక్క కొడుకు నితిన్ హైదారబాద్‌లో బిటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. దసర పండుగకు ఇటీవల ఇంటికి వచ్చి సరదాగా వరంగల్, గోదావరిఖనికి చెందిన ఐదుగురు స్నేహితులతో కలిసి ఆదివారం ములుగు వాటర్‌ఫాల్స్‌కు వెళ్లారు. ఈతకు దిగగా నితిన్ గల్లంతయ్యాడు. ఈతగాళ్లు అచూకి కోసం వెతుకులాటలో నితిన్ మృతదేహం లభించింది. పండుగ పూట అ కుటుంబంలో విషాదం నెలకొంది.

తాగినమత్తులో యువకుడు..

సుల్తానాబాద్: మద్యం తాగిన మైకంలో యువకుడు మృతి చెందిన సంఘటన అదివారం సుల్తానాబాద్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వివరాలు ఉన్నాయి. మున్సిపల్ పరిధిలోని పూసాల గ్రామానికి చెందిన కంకణాల శ్రావణ్ (30) వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం కోనసాగిస్తుండేవాడు. వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడనీ, శనివారం రాత్రి స్థానిక రైస్‌మిల్ అసోసియేషన్ పక్కన ఉన్న కిరాణ షాప్ రేకులపైకి ఎక్కాడనీ అదే సమయంలో ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో అసోసియేషన్ కాంపౌండ్ గోడ, కిరాణ దుకాణా గోడల మధ్య ఇరుక్కొని ఉపిరాడక చనిపోయాడనీ తెలిపారు. అతని తల్లి విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపారు.

పెద్దాపూర్‌లో కలుసుకున్న పోలీస్ అధికారులు, కానిస్టేబుళ్లు

పోలీసుల ఆత్మీయ సమ్మేళనం

జూలపల్లి, అక్టోబర్ 6 : ప్రతి రోజూ శాంతి భద్రతల పరిరక్షణలో బిజీ బిజీగా ఉండే పోలీసులు ఒకచోట చేరి ఆత్మీయతలు పంచుకున్నారు. సివిల్, ఏఆర్, టీఎస్ఎస్‌పీ, ఎక్సైజ్, అగ్నిమాపక, సీఆర్‌పీఎఫ్, ఎస్‌పీఎఫ్, జైళ్లు, రైల్వే శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. వారంతా జూలపల్లి మండలంలో పుట్టి పెరిగి వివిధ పోలీస్ శాఖల్లో ఉద్యోగరిత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఒకరికొకరూ సమాచారం అందించుకొని ఒక్కటయ్యారు. ఈ క్రమంలో పెద్దాపూర్‌లోని శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఆదివారం మండలస్థాయి 'యూనిఫామ్ సర్వీసెస్ పోలీసుల ఆత్మీయ సమ్మేళనం' ఏర్పాటు చేసుకున్నారు. పోలీస్ అధికారులకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. అలాగే కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. భవిష్యత్‌లో విద్య, వైద్య రంగాల్లో నిరుపేదలకు అండగా నిలిచి భరోసా ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఇక్కడ సీఐలు ఆవుల రాజయ్య, జవ్వాజి సురేశ్, తీగల శ్రీధర్, పంగ శ్రీనివాస్, నోముల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఆర్ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ శంకర్‌సింగ్, మ్యాకల లక్ష్మయ్య పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం..

- దొంగతనం కేసులో బైండోవర్ చేయడంతో
- మనస్తాపం చెందినట్లు సూసైడ్ నోట్..

చికిత్స పొందుతున్న విజయ్

మంథని/మంథని రూరల్, అక్టోబర్ 6 : ఓ యువకుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడి సూసైడ్ నోట్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేసిన తీరు మంథనిలో చర్చనీయాంశంగా మారింది. సింగరేణి సంస్థ ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-2 విస్తరణలో భాగంగా మంథని మండలం పాత రచ్చపల్లి గ్రామంలో కొనసాగుతున్న సీ-5 కంపెనీ ఓవర్ బర్డెన్ (ఓబీ) పనులను నిర్వహిస్తున్న విషయం విధితమే. ఈ కంపెనీలో భూ నిర్వాసితుడైన రచ్చపల్లికి చెందిన వాంకుడోతు విజయ్ అనే యువకుడు సర్వెస్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. గత నెల 15 రోజుల క్రితం సీ-5 కంపెనీకి చెందిన టైర్లు మాయం కావడంతో కంపెనీ అధికారులు మంథని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో భాగంగా విజయ్‌తో పాటు కొంత మందిని ఆదుపులోకి తీసుకొని బైండోవర్ చేశారు. ఆనంతరం సీ-5 కంపెనీ సైతం దొంగతనానికి పాల్పడ్డ వారిని ఉద్యోగాలు నుంచి తొలంగించారు. ఈ నేపథ్యంలో మనస్థాపం చెందిన విజయ్ రామగిరి మండలం సెంటినరీకాలనీలో ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకునే ముందు ఒక సూసైడ్ నోట్ రాసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. పురుగుల మందు తాగి విషయాన్ని తన స్నేహితుడైన శ్రీకాంత్‌కు ఫోన్‌లో తెలుపడంతో వారు హుటాహుటిన అతడని గోదావరిఖని దవాఖానకు తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. దీనిపై మంథని ఎస్ఐ రమేశ్‌ను వివరణ కోరగా, 45 రోజుల క్రితం సీ-5 కంపెనీలో టైర్లు చోరీకి గురైనట్లు కంపెనీ వారు ఫిర్యాదు చేశారన్నారు. కంపెనీ వారి ఫిర్యాదు మేరకు అనుమానితులుగా ఉన్న నలుగురు వ్యక్తులను విచారించినట్లు తెలిపారు. టైర్లు తిరిగి లభ్యం కావడంతో ఆ నలుగురు వ్యక్తులను బైండోవర్ చేశామన్నారు. ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డ దానిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వివరించారు.



విజయ్ రాసిన సూసైడ్ నోట్

దడ పుట్టిస్తున్న వంటింటి సరుకుల ధరలు

- స్టాకు పాతదే.. రేట్లే కొత్తవి
- సామాన్యులపై ఆర్థిక భారం
- అధికారుల పర్యవేక్షణ కరువు
- రసీదులు ఇవ్వకుండా మోసగిస్తున్న వ్యాపారులు

కోల్‌సిటీ/కమాన్‌పూర్, అక్టోబర్ 6 : వంటింటి సరుకుల ధరలు సామాన్యుడికి దడ పుట్టిస్తున్నాయి. పాత స్టాకును వ్యాపారులు ప్రస్తుత ధరలతో విక్రయిస్తూ ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వినియోగదారులకు రసీదులు ఇవ్వకుండా మోసాలకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఈ దసరా, బతుకమ్మ పండుగలకు సామాన్యులపై ఆర్థిక భారం తప్పడం లేదు.

అమాంతం పెరిగిన నిత్యావసరాల ధరలు

పండుగ సీజన్ రావడంతోనే నిత్యావసరాల ధరలు అమాంతం పెరుగుతున్నాయి. నూనె ధరలు లీటరుపై రూ.20-45 వరకు, వెల్లుల్లి కిలో రూ.300 నుంచి రూ.360, అల్లం కిలో రూ.100 నుంచి రూ.160, ఎండుమిర్చి రూ.200 నుంచి రూ.240, పెసరపప్పు రూ.150, మినపప్పు రూ.135, కందిపప్పు రూ.150 నుంచి రూ.175 వరకు పెరగడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. ఇక ఉల్లిపాయ ధర కిలో రూ.60 కి చేరుకోవడం గమనార్హం. ఆయిల్‌పామ్, సోయా, పొద్దు తిరుగుడులపై మాత్రమే కేంద్ర ప్రభుత్వం పన్ను విధించగా, ఇదే అదునుగా భావించిన వ్యాపారులు అన్ని రకాల వంట నూనెల ధరలను పెంచి విక్రయిస్తున్నారు. పప్పుల రేట్లు కూడా అమాంతం పెంచేశారు. కంది పప్పు ప్రస్తుతం మార్కెట్‌లో రూ.170 చొప్పున విక్రయిస్తున్నారు. పెసర పప్పు రూ.150కి విక్రయిస్తున్నారు.

సరుకులకు రసీదులు ఇవ్వడం లేదు...

కాగా, పట్టణ, నగర, గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాల్లో కొనుగోలు చేసిన సరుకులకు సంబంధించి వ్యాపారులు రసీదులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, అవేమి ఇక్కడ కనిపించడం లేదు. వినియోగదారులకు రసీదులు ఇవ్వకుండానే అధిక ధరలకు విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. వీటిని అరికట్టాల్సిన సంబంధిత శాఖల అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. ఈ పండుగ పూటనైనా ఆర్థిక దోపిడీని అరికట్టాలని సామాన్య ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మల్లాపూర్ శివారులో రోడ్డుపై గుంతలు

అధ్వానంగా రోడ్డు

- ప్రయాణికుల తిప్పలు
- పట్టించుకోని అధికారులు

ధర్మారం, అక్టోబర్ 6 : కరీంనగర్-రాయపట్నం ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పడి అధ్వానంగా మరింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పండుతున్నారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వివరాల్లో వెళ్తే.. కరీంనగర్ నుంచి రాయపట్నం దాకా హైవే రోడ్డు నిర్మాణం 1998-2000లో విదేశి సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. నిర్మాణం చేసి సుమారు 23 ఏండ్లు కావస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు లంబాడి తండా(బీ), బంజేరుపల్లి, మల్లాపూర్, కమ్మర్‌ఖాన్‌పేట ఎక్స్ రోడ్లు కూడా దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, రోడ్లకు మరమ్మతు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. ధర్మారం మండల పరిధిలోని రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'సింగరేణి ఎస్టేట్ అధికారిని అరెస్ట్ చేయాలి'

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 6 : రామగుండం పోలీసు కమిషనరేట్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అర్నకొండ సదానందంను కులంపేరుతో దూషించిన సింగరేణి ఎస్టేట్ ఆఫీసర్ సాంబశివరావును వెంటనే అరెస్ట్ చేయాలని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు పేర్కొన్నారు. కులంపేరుతో దూషించినట్లు బాధిత దరఖాస్తు ఇచ్చిన 24 గంటల్లో ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసునమోదు చేయాల్సి ఉండగా, స్థానిక సీఐ 18 రోజుల తర్వాత ఉన్నత పోలీసు అధికారులు, ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ సభ్యుల ఆదేశాలతో ఎస్టేట్ ఆఫీసర్ సాంబశివరావుపై అట్రాసిటీ కేసునమోదు చేశారని, తదుపరిగా ఆ అధికారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన పోలీసు అధికారులను కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

గోదావరిఖని, అక్టోబర్ 6: అంతర్గాం మండలం కుందనపల్లి గ్రామంలో అక్రమంగా ఆటో ట్రాలీలో తరలిస్తున్న 139 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని డిప్యూటీ తహసీల్దార్ రవీందర్‌కు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆదివారం పట్టుకున్నారు. అమ్మకపు దారుడిని ఆదుపులోకి తీసుకొని, బియ్యాన్ని స్వాధీన పరుచుకొని విచారణ కోసం అంతర్గాం పోలీసులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వెల్గటూర్, అక్టోబర్ 6: ఎండపల్లి మండలం గుల్లకోట ఐకేపీ సెంటర్ మూలమలుపు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం సాయంపేట గ్రామానికి చెందిన సాయి (25) మృతి చెందాడు. కాగా, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.